క్లుప్తంగా

చాట్రాయిలో బతుకమ్మ ఊరేగింపు



చాట్రాయి: చాట్రాయి గ్రామంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకను మహిళలు ఘనంగా నిర్వహించారు. తంగేడు పూలతో తయారు చేసిన బతుకమ్మను తలపై పెట్టుకుని పాటలు పాడుకుంటూ కోలాటంతో బతుకమ్మ బతుకమ్మ మా ఇంట ఇలవేల్పువ్మా అంటూ గ్రామంలో ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

29న సొసైటీ ఉద్యోగుల మహాసభ

నూజివీడు: పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర రెండవ మహాసభను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో ఉదయం తొమ్మిది గంటలకు మహాసభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాంతీయ సమస్యలతోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్టు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెట్రోలు బంకు ప్రారంభం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని విజయవాడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకును ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. వాహనదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్‌ను అందుబాటులో ఉంచాలని బంకు యజమానులు దుప్పల నాగరాజు, వీరకృష్ణకు సూచించారు. తహసీల్దార్ ఉదయ భాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఉపాధ్యక్షురాలు పావ నజ్యోతి సుజనకుమారి, గ్రామ అధ్యక్షుడు చిమటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారానికి నివేదిక

నూజివీడు: ఈ ఖరీఫ్ సీజన్‌లో నూజివీడు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వర్షాభావం కారణంగా 550 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని ఏడీఏ జి.విద్యాసాగర్ బుధవారం తెలిపారు. సెప్టెంబరు, అక్టోబర్‌లో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదవడంతో వరి పంటకు కావాల్సిన సాగునీరు అందక ఎండిపోయిందని చెప్పారు. చాట్రాయి మండలం చనుబండ, నరసింహారావుపాలెం తదితర గ్రామాల పరిధిలో చెరువుల కింద సాగుచేసిన వరి పంటకు సాగునీటి ఎద్దడి కారణంగా 500 ఎకరాలు, ముసునూరు మండలం గుడిపాడు పరిధిలో 50 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని తెలిపారు. ఈ మేరకు నివేదికను నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి పంపించామని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పంట నష్ట విస్తీర్ణం మరింత పెరుగుతుందని ఏడీఏ తెలిపారు.

ఆర్డీఓగా మాధవి బాధ్యతల స్వీకారం



తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా కొత్తా మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై విజయవాడ టూరిజం ఆర్‌జేడీగా నియమితులైన వైవీ ప్రసన్నలక్ష్మిని రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. తిరువూరు డివిజన్లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటియాజమాన్యంపై శిక్షణ



తిరువూరు: వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై ఎన్టీఆర్ జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో తిరువూరు మండలం కోకిలంపాడులో బుధవారం క్షేత్రపరిశీలన అనంతరం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి సమస్య ఉన్న భూముల్లో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, యూరియా లీటరు నీటికి 20 గ్రాములు కలిపి ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయాధికారి సత్యవతి తెలిపారు. తిరువూరు ఏఓ పద్మ పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

36,990 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు



తిరువూరు మండలం వామకుంట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

తిరువూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు తిరువూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో సత్ఫలితాలనిచ్చాయి. 60 వైద్యశిబిరాల్లో 36,990 మంది ఔట్ పేషెంట్లకు వైద్యచికిత్స చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. గత నెల రోజుల్లో నియోజకవర్గంలోని తిరువూరు మండలంలో 16, గంపలగూడెం మండలంలో 16, ఏకొండూరులో 13, విస్సన్నపేటలో 15 వైద్య శిబిరాలు నిర్వహించారు. 17,663 మంది పురుషులు, 17,554 మంది మహిళలకు ఈ శిబిరాల్లో వైద్యసేవలు అందించారు.

దీర్ఘకాలిక రోగులకూ వైద్యసేవలు

వైద్యశిబిరాల నిర్వహణకు ముందు వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన సర్వేలో గుర్తించిన రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో పూర్తిస్థాయిలో వైద్యసేవలందించారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తిరువూరు ఏరియా ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు ప్రత్యేక బృందాలుగా ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వివిధ వ్యాధులకు చికిత్స చేశారు. రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక సేవలందించారు.

వైద్య శిబిరాల వివరాలు

మండలం	శిబిరాలు	ఔట్ పేషెంట్లు	రిఫర్ చేసిన రోగుల సంఖ్య	నేత్రరోగుల చికిత్స
ఏకొండూరు	13	5,390	208	676
గంపలగూడెం	16	12,399	36	1,229
తిరువూరు	16	10,102	37	1,176
విస్సన్నపేట	15	9,099	10	1,314
మొత్తం	60	36,990	291	4,395

సంతృప్తికరంగా సేవలు

జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాల్లో వైద్యసేవలు సంతృప్తికరంగా అందించాం. రోగులు ఆస్పత్రికి వచ్చే అవసరం లేకుండా మెడికల్ కిట్లను ఉచితంగా సరఫరా చేశాం. పేద రోగులకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– కల్యాణ్‌చక్రవర్తి, చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి

ముగిసిన దసరా నవరాత్రి ఉత్సవాలు



తిరువూరులో కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు



కొండపల్లిలో అన్నదానాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్



గంపలగూడెం గాంధీసెంటర్‌లో అమ్మవారి విగ్రహం గ్రామోత్సవం

తిరువూరు: పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. సర్దార్ పేట బాపయ్య కూరగాయల మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన నవరాత్రి పందిరిలో అమ్మవారి విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. బతుకమ్మ వేడుకలను కూడా పట్టణంలోని జగన్నాథపురం కాలనీ, రాజుపేట, అశోక్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించారు.

అన్నసమారాధన

విస్సన్నపేట: దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక ద్వారకా నగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానం వద్ద బుధవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం: స్థానిక ఖిల్లారోడ్డులో ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం వివిధ రకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాదునైన కత్తులతో భక్తిపూర్వకంగా తమ ఒంటిపై హత్తుకునేలా భక్తులు చేసిన సేవ పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రామికనగర్‌లో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతినగర్‌లో దుర్గాగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మున్సిపాల్టీ 26వ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: అమ్మా! భవానీ.. కాపాడమ్మా, కరుణించమ్మా! అంటూ భక్తుల శరణుఘోషతో బుధవారం గంపలగూడెం మార్మోగింది. దసరా సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి శిబిరాల్లో 10 రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అమ్మవారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం భక్తిభావంతో జరిగింది. గంపలగూడెం గాంధీసెంటర్, కాపులవీధి, పప్పుల మిల్లు సెంటర్, రామాలయం వీధుల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం విగ్రహాలను నల్లచెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ఎఫ్ఎల్‌సీ పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గొల్లపూడి గోడౌన్ వద్ద కలెక్టర్ ఢిల్లీరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి వారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో భాగంగా గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోడౌన్‌లో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియపై బుధవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 1,605 బ్యాలెట్ యూనిట్లు, 1605 కంట్రోల్ యూనిట్లు, 1,695 వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తున్నామన్నారు. చెకింగ్ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 285 యూనిట్ల చొప్పున 20 రోజుల పాటు 5,700 పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పుష్కర్ ఘాట్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీల దీక్ష విరమణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పుష్కర్ ఘాట్, సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో పర్యటిస్తూ ఘాట్ వద్ద యాత్రికులు స్నానం చేసేందుకు గల సదుపాయాలు, కేశఖండనశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంత పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవానీల దీక్ష విరమణ సమయంలో వారు వదిలేసే వస్త్రాలను ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. యాత్రికులకు అందుబాటులో ఉంచిన తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, హెల్త్ ఆఫీసర్-3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిగా సాగిన శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి, శారదాంబ, మహాలక్ష్మి అమ్మవార్లను నిజరూపంలో భక్తి యాత్రను నిర్వహించారు. సత్యనారాయణపురం, బీఆర్‌టీఎస్ రోడ్డుమీదుగా దేవాలయం ప్రాంగణానికి చేరుకుంది. వీరుభొట్ల లక్ష్మీకుమార శర్మ, కూచిభొట్ల పండు దేవాలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

తునికిపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం తునికిపాడులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలో గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యులు, స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్యసేవలు అందజేస్తారని పేర్కొన్నారు.

వెంకటాయపాలెంలో..

నూజివీడు: మండలంలోని వెంకటాయపాలెంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ శివారులోని కొత్తూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు, గొల్లపల్లి, దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొని సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

ముసునూరు తాత్కాలిక ఎంపీపీగా రాజానాయన

ముసునూరు: తాత్కాలిక ఎంపీపీగా లోపూడి ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ-1 కోటగిరి రాజానాయనను నియమిస్తూ కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ, ఏలూరు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. ఇప్పటి వరకు ఓసీ (మహిళ) కోటాలో ఎంపీపీగా పని చేసిన రాపర్ల కృష్ణకుమారి అనారోగ్య కారణంతో రాజీనామా సమర్పించగా ఈ తాత్కాలిక నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం



పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ దేవస్థానం చైర్మన్ కోటగిరి సునీల్ కుమార్‌కు చెందిన శ్రీనివాసా ఫంక్షన్ హాల్‌ను ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సారా తయారుచేస్తే కఠిన చర్యలు

చాట్రాయి: సారా తయారుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. బుధవారం సారా తయారీదారులకు సారా నిర్మూలనపై కౌన్సిలింగ్ ఇచ్చారు. సారా తాగిన అనేక మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారని, ఈ నేపథ్యంలో సారా తయారీని నిర్మూలించాలని ఆయన కోరారు. అనంతరం ఏడుగురు సారా తయారీదారులను నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మురళీధర్ తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కనసానపల్లిలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసి ముందుకెళుతున్నామని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో ఎమ్మెల్యే బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లు, రెండు కల్వర్టులను ప్రారంభించారు. రూ.36 లక్షల అంచనాలతో కోఆపరేటివ్ బ్యాంక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన, జగనన్న కాలనీలో గృహాలను, జగనన్న కాలనీలో 24 గంటలూ విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గడపగడపలో వచ్చిన సమస్యలను చాలావరకు పరిష్కరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, తహసీల్దార్ ఉదయ భాస్కర్, ఎంపీడీఓ శంకరరావు, సర్పంచ్ అమ్మిశెట్టి రమణ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పల్లెర్లమూడిలో మందుల కిట్‌ను అందిస్తున్న సర్పంచ్ సౌమ్యరేఖ

నూజివీడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పల్లెర్లమూడి సర్పంచ్ పులపాక సౌమ్యరేఖ అన్నారు. మండలంలోని పల్లెర్లమూడి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సౌమ్యరేఖ ప్రారంభించి మాట్లాడారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ శిబిరంలో 618 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారని, మెరుగైన చికిత్స నిమిత్తం 16 మందిని రిఫర్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, ఎంపీటీసీ చిలుకూరి అనూర్‌బాషా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ పాల్గొన్నారు.

612 మందికి వైద్యసేవలు

గాదెవారిగూడెం: గంపలగూడెం మండలంలోని గాదెవారిగూడెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులు సురేష్, శృతి, కీర్తి, ఆప్తమాలజిస్టు శ్రీనివాసరావు శిబిరంలో 612 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తుటారి శ్రీనివాసరావు, ప్రేమరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం



తిరువూరు అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ

తిరువూరు: స్థానిక విజయవాడరోడ్డులోని శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానంలో దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అయ్యప్పదీక్షాపరులతో పాటు శైవదీక్ష, భవానీ మాలా ధారులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజారావు తెలిపారు. ఆలయ 26వ వార్షికోత్సవ సందర్భంగా పడిపూజా కార్యక్రమానికి పాటను కూడా నిర్వహించినట్లు తెలిపారు.


ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. వివిధ వార్డుల్లో పర్యటించారు. ఫెర్రీలో రోడ్లు శుభ్రం చేయడం, చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి సరఫరా, డ్రెయినేజీల శుభ్రత, వీధిలైట్లు నిర్వహణ వంటి పనులు కమిషనర్ పరిశీలించారు.

ముగిసిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అయోధ్యనగర్‌లో అమ్మవారి ఊరేగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం నగరోత్సవం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారిని ఉంచి మేళతాళాలు డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. దారి పొడవునా భక్తులు అమ్మవారికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. గద్దే శ్రీను, నూతక్కి శ్రీను, కొండా మహా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని హంసవాహనంపై ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది.

మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు, మధురానగర్ రమాదేవి నగర పాలక సంస్థ పాఠశాల సమీపంలో అన్నదానం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆటో ఢీ కొని బాలుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీ కొనడంతో బాలుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైనవరం సుందరయ్యనగర్‌కు చెందిన జే జయసూర్య 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే జయసూర్య తల్లి చనిపోవడంతో పెద్దనాన్న ఏసుబ్ వద్దే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం వైవీఆర్ చికెన్ షాపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో జయసూర్యకు గాయాలు కాగా, తిరిగి ఆటో డ్రైవర్ జయసూర్యను దూషించాడు. దీంతో స్థానికులు జయసూర్య అన్నయ్యకు ఫోన్ చేయడంతో హుటాహుటిన బీఆర్‌టీఎస్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేశారు.